క్లుప్తంగా

చేసిన పనులే శాశ్వత కీర్తినిస్తాయి



జోగుళాంబ శక్తిపీఠం: విధి నిర్వహణలో ఉద్యోగి నిస్వార్థంగా చేసే మంచి పనులే వారికి చిరస్థాయిగా కీర్తిని అందిస్తాయని ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ అన్నారు. బుధవారం అలంపూర్ జోగుళాంబ ఆలయంలో అటెండర్‌గా విధులు నిర్వహించే ఈశ్వరమ్మ పదవీ విరమణ సందర్భంగా ఆలయ ఉద్యోగులు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ, వనం శ్రీకాంత్ శర్మ, నీలప్ప, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటనారాయణ, సత్యనారాయణ, జిల్లా అర్చక ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి ఆచారి, ఆలయ ఉద్యోగులు ఉన్నారు.

నూతన ఎస్‌ఐ ప్రత్యేక పూజలు



జోగుళాంబ శక్తిపీఠం/అలంపూర్: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను బుధవారం నూతన ఎస్‌ఐ నాగరాజు దర్శించుకున్నారు. బదిలీపై వచ్చిన తను ముందుగా జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలను దర్శించి పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రమేష్ జిల్లాలోని డీఎస్‌బీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మహబూబ్‌నగర్ డీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఆయన ఇక్కడికి వచ్చారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి విధుల నిర్వాహణపై పలు సూచనలు చేశారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



అయిజ: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని 6వ వార్డులో వివిధ కాలనీల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. పారిశుద్ధ్యం లోపించిన పరిసర ప్రాంతాలను గమనించి వాటిని పరిశుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని, రోడ్లను శుభ్రంగా ఊడ్చాలని, మురుగు కాల్వల్లో ఎప్పటికప్పుడు మురుగును తొలగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో మాజీ సర్పంచు బెక్కెసుల బాబు అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ మందా జగన్నాథం పరామర్శించారు. ఆయనతో పాటు మందా శ్రీనాథ్, తదితరులు ఉన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలోని అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. బుధవారం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, పుష్పాలంకరణ చేశారు. కార్యక్రమంలో శివ స్వాములు అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకుంటాం



అయిజ: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వివేక కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జీ ఎంఈఓ నరసింహ అన్నారు. బుధవారం కోచింగ్ సెంటర్‌పై దాడులు నిర్వహించారు. కోచింగ్ సెంటర్‌లో ఉన్న రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీ ఎంఈఓ మాట్లాడారు. అయిజ మండలంలో అనుమతులు లేకుండా కోచింగ్ సెంటర్లను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని, వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు అనేకమంది కోచింగ్ సెంటర్‌కు పాఠశాల నిర్వాహన సమయంలో హాజరవుతున్నారన్నారు. కోచింగ్ సెంటర్లకు సహకరిస్తున్న పాఠశాలల హెడ్‌మాస్టర్లపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో ఎరువుల వివరాలు

- పక్కాగా ఎరువుల నిల్వలు
- కొత్తగా ఫర్టిలైజర్ ఇన్వెంటరి వెరిఫికేషన్ సిస్టం యాప్
- ఎరువుల దుకాణాల్లో నిల్వల నమోదు
- సేల్ పాయింట్లు, ఆధార్, తంబు, ఫొటోల ఆధారంగా అమ్మకాలు
- సోమవారం, గురువారం పక్కా ఆన్‌లైన్..



ఎరువుల నిల్వలను యాప్‌లో ఎంట్రీ చేస్తున్న ఏడీఏ సక్రియ నాయక్

ఉండవెల్లి: ఎరువుల నిల్వల లెక్కలు ఇకపై పక్కాగా నిర్వహించనున్నారు. ఇందుకోసం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫర్టిలైజర్ ఇన్వెంటరి వెరిఫికేషన్ సిస్టం ఎరువుల దుకాణాల్లో నిల్వల వివరాలను కొత్త యాప్ లో నమోదు చేస్తారు. ఎరువుల విషయంలో నిల్వల లెక్క పక్కాగా లేకపోవడంతో తరుచు సమస్యలు తలెత్తుతున్నాయి. గో డౌన్లలో ఉన్న నిల్వలకు వ్యత్యాసం ఉంటున్నట్లు వ్యవసాయ అధికారుల తనిఖీలో బయటపడుతున్నది. దీంతో వ్యవసాయశాఖ నూతన సాంకేతికత ఆధారంగా పక్కాగా వ్యవస్థను రూపొందించింది.

దుకాణాల్లో తనిఖీ

అలంపూర్ నియోజకవర్గంలో వ్యవసాయ అధికారులకు 15 రోజుల నుంచే కొత్త యాప్‌ను అమల్లోకి తీసుకొచ్చారు. ఈ మేరకు అధికారులు ఎరువుల దుకాణాలు తనిఖీ చేసి సేల్ పాయింట్ల వద్ద ఎరువు నిల్వల వివరాలు, ఫొటోలను, ప్రతి సోమ, గురువారాల్లో యాప్‌లో నిక్షిప్త పరుస్తారు. స్టాక్ రిజిస్టర్‌లో సంతకం పెట్టే ఫొటోలను మూడురోజుల వ్యవధిలోగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఫర్టిలైజర్ ఉంటేనే.. యాప్‌లో నమోదు

డీఏపీ, యూరియా తదితర ఎరువులు దుఖాణాల్లో ఉంటేనే ఎన్ని నిల్వ ఉన్నాయో అక్కడికి వెళ్లి అధికారులు అక్కడ పక్కగా వెళ్లి గూగుల్‌లో వివరాలు నమోదు చేసి యాప్‌లో ఎంట్రీ చేస్తారని అధికారులు పేర్కొన్నారు. అలంపూర్ నియోజకవర్గంలో 300కు పైగా ఫర్టిలైజర్ దుకాణాలున్నాయని, వాటిలో కొన్ని దుకాణాల్లో ఎరువుల వాడకం తగ్గితే యాప్ వర్తించదని తెలిపారు. రైతులకు ఎంత ఎరువులు నిల్వ ఉన్నాయో లేదో తెలియడానికే కొత్త యాప్‌ను ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.



ఉండవెల్లి మండలంలో పంటల నమోదును పరిశీలిస్తున్న అధికారులు

యాప్‌తో ఎరువుల నిల్వలకు మంచిది..



రైతులు పండించిన పంటలకు యాప్‌ను ఎరువుల శాతాన్ని ఏర్పాటు చేశారు. కొత్త యాప్ ద్వారా పంట పొలాల్లో ఎరువుల వాడకంతో ఉపయోగాలను తెలుసుకుని దుకాణాల్లో ఎంత శాతం నిల్వలు ఉన్నాయో లేవో తెలియడానికి మంచి పద్ధతిని ఏర్పాటు చేశారు. అధికారుల పర్యావేక్షణ ఉంటుంది కాబట్టి రైతులకు సమాచారం అందించాలి.

– శ్రీరాములు, రైతు, ఉండవెల్లి

రైతులకోసమే ప్రత్యేక యాప్



ఎరువుల నిల్వలు తెలుసుకోవడానికి కొత్త యాప్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి అధికారి గ్రామంలోని ఎరువుల దుకాణాలకు వెళ్లి తనిఖీ చేసి రికార్డుల నమోదును యాప్‌లో ఎంట్రీ చేస్తేనే ఎంత నిల్వలు ఉన్నాయో తెలుసుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల రైతులకు ఈ యాప్ ద్వారా అధికారులు సమాచారం అందిస్తారు.

– సక్రీయ నాయక్, ఏడీఏ అలంపూర్ డివిజన్

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మల్దకల్‌లో అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న సీడీపీఓ కమలాదేవి

మల్దకల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ కమలాదేవి సూచించారు. బుధవారం మల్దకల్‌లో అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు పోషకాలు ఎక్కువగా ఉండే పాలు, గుడ్లు, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగరాణి, బాలమ్మ, టీచర్లులు పాల్గొన్నారు.

సమావేశం బహిష్కరించిన కౌన్సిలర్లు



సమావేశం బహిష్కరించిన మహిళా కౌన్సిలర్లు

శాంతినగర్: మెజారిటీ కౌన్సిలర్ల నిర్ణయాన్ని వ్యతిరేకించి ఏకపక్ష నిర్ణయం తీసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్‌ను వ్యతిరేకిస్తూ సమావేశం నుంచి మహిళా కౌన్సిలర్లు బైకాట్ చేశారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం బుధవారం చైర్‌పర్సన్ కరుణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే ఐదుగురు మహిళా కౌన్సిలర్లు సమావేశాన్ని బైకాట్ చేశారు. గత నెలలో జరిగిన మున్సిపాలిటీ సమావేశంలో కమిషనర్ వేతనం, ఇతర అంశాల గురించి చర్చించామని, వడ్డేపల్లి చిన్నమున్సిపాలిటీ అయినందున కమిషనర్ జీతం మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నుంచి ఇవ్వడం సాధ్యం కాదని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు ఐదుగురు కౌన్సిలర్లు పేర్కొన్నారు. మొత్తం పది మందిలో ఐదుగురు కౌన్సిలర్లు తీర్మానించామన్నారు. ఇటీవల కమిషనర్ జీతాన్ని మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నుంచి చెక్కు రూపంలో డ్రా చేయడంతో సమావేశాన్ని బహిష్కరించినట్లు తెలిపారు. కౌన్సిలర్లు ఏకగ్రీవ తీర్మానం చేసినా చైర్‌పర్సన్ పట్టించుకోకుండా కమిషనర్, మేనేజర్‌తో కుమ్మక్కై సొంత నిర్ణయాలు తీసుకుని మెజారిటీ కౌన్సిలర్లను అవమానపరిచారన్నారు. ఈ విషయమై కమిషనర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కొత్త మున్సిపాలిటీల్లో కమిషనర్ పోస్టులు ప్రభుత్వం భర్తీ చేయలేదన్నారు. రాష్ట్రంలో 2019లో కొత్తగా ఏర్పాటైన సుమారు 40 మున్సిపాలిటీల్లో జనరల్ ఫండ్ నుంచి జీతాలు తీసుకోవాలని జీఓ ఉన్నందున నిబంధనల ప్రకారం జీతం తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సభ్యులకు వివరించినా వినకుండా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామంటూ సమావేశం హాల్ నుంచి బయటకు వెళ్లిపోయినట్లు తెలిపారు. మూడు నెలల క్రితం కమిషనర్‌గా వడ్డేపల్లి మున్సిపాలిటీకి వచ్చానని, సభ్యుల ఆమోదం మేరకు, జీఓ ప్రకారం మూడు నెలల జీతం ఒకేసారి తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలపై, మొత్తం 10 అంశాలు ఎజెండాలో సభ్యులను కోరినట్లు కమిషనర్ వివరించారు.

సర్పంచ్‌లకు ఘన సన్మానం



ధరూరులో ఉప సర్పంచు, వార్డు సభ్యులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బూరెడ్డిపల్లి సర్పంచు బండ్ల జ్యోతిని, వార్డు సభ్యులను సన్మానించిన గ్రామస్తులు

ధరూరు: గ్రామ సర్పంచులు, వార్డు సభ్యుల పదవీ కాలం ముగియడంతో బుధవారం మండల కేంద్రంలోని బీసీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మండల నాయకులు రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బండ్ల వెంకటేశ్వరరెడ్డిలు శాలువాలు, పూలమాల, మెమెంటోలతో సన్మానించారు. మండలంలోని మార్లబీడులో సర్పంచు సుజాతను, వార్డు సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కర్రెన్న, కాంగ్రెస్ నాయకులు రామిరెడ్డి, నాగన్న, దేవదాసు, దావీదు, షాకీర్, రంగేష్, తిమ్మన్న పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధుల సేవలు అమోఘం

కేటీదొడ్డి: సర్పంచు సూర్యప్రకాష్, ఉపసర్పంచు గ్రామానికి చేసిన సేవలు అమోఘమని గ్రామ ప్రజలు కొనియాడారు. పంచాయతీ పాలకుల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో మండలంలోని పాతపాలెం పంచాయతీ కార్యాలయంలో సర్పంచు, ఉప సర్పంచ్‌లను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మదన్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు గ్రామ ప్రజలు ఉన్నారు.

సర్పంచు, వార్డు సభ్యులకు సన్మానం

ధరూరు: గ్రామ సర్పంచుల పాలన నేటితో ముగియడంతో గ్రామస్తులు బూరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచు బండ్ల జ్యోతి, ఉప సర్పంచు రంగస్వామిలతో పాటు వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రమేష్ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గోవిందురెడ్డి, మధుమతి పాల్గన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

రాజోళి: మండలంలోని తూర్పుగార్లపాడు సర్పంచ్ శేషమ్మకు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో రైతు వేదికలో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. సందర్భంగా పూలమాల, శాలువాతో ఆమెకు సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఖలీం, ఏఈఓ ఇబ్రహీం, ఫీల్డ్ అసిస్టెంట్ జమ్మన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.



కేటీదొడ్డిలో సర్పంచు, ఉపసర్పంచును సన్మానించిన గ్రామ ప్రజలు



తూర్పు గార్లపాడ్ సర్పంచ్ శేషమ్మకు సన్మానం చేస్తున్న అధికారులు

డైరీ ఆవిష్కరణ



గద్వాల అర్బన్: ఎస్‌జీటీయూ ఉపాధ్యాయ సంఘానికి సంబంధించిన 2024 డైరీని బుధవారం జెడ్పీ చైర్ పర్సన్ సరిత ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్జీటీయూ అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి సోమసుందర్ రెడ్డి, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు రవీందర్‌రెడ్డి, కాంతయ్య ఉన్నారు.

ఆటో కార్మికులను తొలగించొద్దు



గద్వాల అర్బన్: గద్వాల మున్సిపాలిటీలో చెత్త సేకరణ చేసే ఆటో కార్మికులను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గట్టన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పెండింగ్‌లోని జీతాలను వెంటనే ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల ఫిబ్రవరి 16న తేదీన దేశవ్యాప్తంగా సమ్మెను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమ్మెను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు శివ, నర్సింహ, రాజేష్, సుధాకర్, రవి, రాము, దౌలమ్మ ఉన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి



గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: ప్రజాయుద్ధ నౌక, కవి, గాయకుడు గద్దర్ జయంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ మాట్లాడారు. సామాజిక తెలంగాణ ఏర్పాటే గద్దర్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అని, గద్దర్ తన ఆటపాటలతో తెలంగాణ సమాజాన్ని ఉత్తేజపర్చారని కొనియాడారు. కార్యక్రమంలో కన్వీనర్ బుచ్చిబాబు, శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, విష్ణు, ప్రేమ్‌రాజ్, రంగస్వామి ఉన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి



దేశ నాయకుల వేషధారణలో మాంటిస్సోరీ విద్యార్థులు

అలంపూర్: మాంటిస్సోరి పాఠశాలలో అమర వీరుల దినోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకోని మంగళవారం రాత్రి అమర వీరుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమర వీరుల ప్రసంగాలు, ఆయా నాయకుల నినాదాలను తోటి విద్యార్థులకు వివరించారు. పాఠశాల డైరెక్టర్ కేఎస్‌వీ రవిప్రకాష్ మాట్లాడుతూ మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం ఎంతోమంది వీరుల త్యాగాల ఫలితంగా వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

వంతెనను ప్రారంభించిన వైస్ ఎంపీపీ



వంతెనను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ

ధరూరు: మండలంలోని ర్యాలంపాడు సమీపంలో కాల్వపై నిర్మించిన వంతెనను బుధవారం మండల వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవతలి ప్రాంతంలో పంట పొలాలు ఉన్న రైతులు రాకపోకలకు ఇబ్బందులు పడే వారని, దీంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో వంతెన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు కర్రెమ్మ, ఉప సర్పంచు చిట్టెం వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచులు దౌలన్న, అంపన్న, బీఆర్ఎస్ నాయకులు నర్సింహులుగౌడ్, నాగరాజు, పురుషోత్తం రెడ్డి, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా వంతెన పనులు



రాజోళి: భారత్‌మాల రోడ్డు పనుల్లో భాగంగా వంతెన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మండలంలో భారత్ మాల హైవే వెళ్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రాజోళి–వడ్డేపల్లి, రాజోళి–బుడమర్సు గ్రామాల మధ్య ప్రధాన రోడ్డు గుండా ఈ హైవే వెళ్తుండటంతో, ఆ రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నారు. గ్రామాలను కలిపే రోడ్ల మధ్యన ఈ హైవే వెళ్తుండటంతో, రాకపోకలకు అంతరాయం కలగకుండా ఫ్లై ఓవర్‌లు నిర్మిస్తున్నారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం



చందూరులో పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మానవపాడు: మండలంలోని చందూరులో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలందరూ కులమతాలకు అతీతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



అమరవాయిలో పౌరహక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న ఆర్ఐ నాగిరెడ్డి

మల్దకల్: మండలంలోని అమరవాయిలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం సర్పంచు పద్మమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్ఐ నాగిరెడ్డి, ఏఎస్ఐ ఈశ్వరయ్యలు హాజరై మాట్లాడారు. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతిని అవలంబించడం, కులవివక్షత పాటించడం చట్టరీత్యా నేరమన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామ ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకునే కుట్ర



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న అఖిల పక్ష, ప్రజాసంఘాలు నాయకులు

గద్వాల అర్బన్: టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవి రాకుండా అడ్డుకునేందుకు మాజీ సీఎం కేసీఆర్ కుట్రలు పన్నుతున్నారని అఖిల పక్ష, ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని క్రిష్ణవేణి చౌరస్తాలో టీజేఎస్ జిల్లా కన్వీనర్ అలూరు ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష, ప్రజాసంఘాలతో నాయకులతో కలిసి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి బుద్ధిచెప్పి తీరు మారలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కోదండరాంను గుర్తించి ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవి సిఫార్సు చేసిందన్నారు. దీనిని గవర్నర్ ఆమోదం తెలిపారని, ఇది జీర్ణించుకోలేక కేసీఆర్ కోదండరాంపై కుట్రలకు తెరలేపారని మండిపడ్డారు. కా ర్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి అంజనేయులు, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాష, బహుజన రాజ్య సమితి అధ్యక్షుడు వాల్మీకి, రైతాంగ సమితి నాయకుడు గోపాల్, టీజేఎస్ నాయకులు మహబూబ్, రాజు, ఇస్మాయిల్ ఉన్నారు.

సూపర్ మార్కెట్‌ను సందర్శించిన విద్యార్థులు



అయిజ: మండల కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్‌ను మల్దకల్ మండలంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఒకేషనల్ టీచర్ శిరీష విద్యార్థులకు సూపర్ మార్కెట్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రస్తుత నిత్యవసర మార్కెట్లో వ్యాపార లాభాలు, డిస్కౌంట్లు, బార్కోడ్ సిస్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కిరాణా దుకాణాల నుంచి సూపర్ మార్కెట్ల వైపు పరుగులు తీస్తున్న నిత్యవసర వస్తువుల విక్రయంలో నూతన పోకడలు వివరించారు. విద్యార్థి స్థాయి నుంచే మార్కెట్ డిస్కౌంట్లు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఒకేషనల్ టీచర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించండి

రాజోళి: మండలంలోని ఆయా గ్రామాలకు బీటీ రోడ్ల సౌకర్యం కల్పించడంలో అలసత్వం చేయకూడదని కేవీపీఎస్ నాయకులు విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రం రాజోళి నుంచి వడ్డేపల్లికి వెళ్లే రోడ్డు, పచ్చర్ల, మాన్‌దొడ్డి తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు కనీసం మరమ్మతులకు నోచుకోలేదన్నారు. మరికొన్ని మంజూరైనప్పటికీ పనులు నిర్వహించడం లేదన్నారు. వెంటనే వాటిని ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

వీధికుక్కల తరలింపునకు చర్యలు



వీధి కుక్కలను పట్టుకుంటున్న ప్రత్యేక సిబ్బంది

గద్వాల: పట్టణంలో కొన్ని రోజులుగా వీధి కుక్కలు స్వైరవిహారం చేసస్తూ ప్రజలపై దాడులు చేశాయి. కుక్కల దాడిలో పలువురు గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కౌన్సిల్, కమిషనర్ నర్సింహ వీధికుక్కల నివారణకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రాజమండ్రి నుంచి ప్రత్యేకంగా సిబ్బందిని పిలిపించి కుక్కలను పట్టించారు. బుధవారం 32 వీధి కుక్కలను పట్టుకున్నారు. పట్టుకున్న కుక్కలను ప్రత్యేక వాహనాలలో అటవీ ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా చైర్మన్ బీఎస్ కేశవ్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణలోనికి తీసుకుని కుక్కల తరలింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. మరో వారంరోజుల పాటు వీధి కుక్కల తరలింపు నిర్వహించనున్నట్లు తెలిపారు.